

# అర్థంకాని ఆంతర్యాలు

అవసరాల నారాయణరావు

"నీ మేనల్లుడు చచ్చిపోయాడను కున్నావా, మావయ్యా? ఎందు కలా కుమిలిపోతున్నావ్?... రత్నం లాంటి పిల్ల! దానికేం?... నే నున్నాను, భయపడకు! చిత్తశుద్ధితో చెబుతున్నాను; నిశ్చింతగా వుండు. ఈ విషయంలో నువ్వు ఏ యితర శంకా పెట్టుకోకు.

ఇట్లు,
రవి."

చెమ్మగిల్లిన రాజశేఖరంగారికళ్ళల్లో ఓ చిన్న మెరుపు మెరిసింది.

పేలవంగా వున్న పెదవులమీద ఓ నీరెండలాంటి బుల్లినవ్వు వెలిసింది.

పైమీదున్న కండువాతో ఓసారి కళ్ళొత్తుకున్నారు.

మనోవేదనతో కుళ్ళిపోతూన్న ఆయ నకు మేనల్లుడి వుత్తరం ఒహతరహా ఉపశమనాన్నీ, ధైర్యాన్నీ కలిగించింది.

*　　*　　*

క్షణక్షణానికీ, అణువణువునా మధు వును నింపుకునే మొదటిరాత్రి!

మరుపురాని మధురానుభూతులతో మైమరపించి, ఒకరిపై యింకొకరికి మమతలూ, ఒకరికోసం యింకొకరిలో మమకారాలూ అంకురింపచేసే అనన్య మైన తొలిరాత్రి!

ఆజన్మాంతం లతలల్లే పరస్పరం పెనవేసుకుపోయే, వుండిపోవాలనే అనంతమైన ఆకాంక్ష నిండిన కళ్ళతో మూగశపథాలు చేసుకునే మధురమైన ప్రప్రథమరేయి!

'పేర్లు చెప్పండి !... గా...డి...ద...గు...డ్డు చెప్పండి !...పదిగంట లవ్వొస్తున్నా యీ ఘటాలు యింకా కదలవు యిక్కణ్నుంచి.'

'ఊఁ !...పేర్లు చెప్పం' డని కొరుక్కు తింటూ, పందిరిపట్టిమంచం చుట్టూ మూగిన పేరంటాళ్ళ మందను చూసి తనలో త నోసారి విసుక్కున్నాడు శ్రీనివాస్.

ఆరునెలలనుంచీ, తిండీ తిప్పలూ మానేసి అదే పనిగా కలలుకంటూన్నాడు ఆ రాత్రికోసం. ఇన్నాళ్ళూ తనలో చెలరేగిన మధురభావనల సంచలనం, తీయనికోర్కెల అలజడీ ఎక్కడో అజ్ఞాతంగా, ఏదో అస్పష్టంగానేవున్నట్లు అనిపించేవి. కాలం ఒక మంచుతెరలా తనకీ వాటికీ అడ్డంగా నించుంది. కాని, యీనాడు ఆ మూడుముళ్ళూ కాస్తా వెయ్యటంతో, ఆ సంచలనం, ఆ అలజడీ అనుభవంలోనికి తర్జుమా కావటానికి దగ్గరపడటంలో, వాటికి ఒహతరహా స్పష్టతా, ఆకృతీ వస్తూన్న ట్లనిపించింది శ్రీనివాస్‌కి,

"అరుంధతి !" అని చెప్పేసి, వెండి గిన్నెలోంచి వేళ్ళతో యింత గంధం తీసి, మంచమీద తన కభిముఖంగా కూర్చున్న అరుంధతి చుబుకం క్రిందా అటుప్రక్కా, యిటుప్రక్కా పూశాడు.

"శ్రీ...ని...వా...స్... బా...వ...గా...రు !" అరుంధతికూడా యింత గంధం తీసి శ్రీనివాస్ బుగ్గమీద, చెయ్యి వేస్తే ఎక్కడ కందిపోతాడో అన్నట్లు రాసింది.

మంగళహారతు లిచ్చి, మందంతా బయట పడింది. మందలో ఆఖరి శాల్తీ గడపవతల కాలు పెట్టగానే, గర్భాదానం గది తలుపులు దభీమని మూసుకు పోయాయ్. అవతల్నుంచి తలుపుకి గొళ్లెం పెడుతూన్న గాజుల చప్పుడు లోపలికి వినిపించింది.

"హమ్మయ్య !... యిప్పటికి వదిలిందిరా బాబూ పీడ !" ఓసారి దీర్ఘంగా నిట్టూర్చాడు శ్రీనివాస్,

ఇప్పుడు పంజరంలోంచి విడిచిపెట్టిన చి ల క లా సర్వస్వతంత్రు డయ్యాడు శ్రీనివాస్ !

అరుంధతి అనే విశాల, వినూత్న ప్రపంచంలో ఎక్కడైనా హాయిగా విహరించొచ్చు ! ఏ చెట్టుకొమ్మమీద కూర్చుని, ఏ పండు తిన్నా తనను అడిగే వాడు లేడు ! అలిసిపోయేదాకా ఆమె యవ్వనప్రాసాదంలో యిష్టంవచ్చినట్లు ఆడుకోవొచ్చు ! అలిసిపోతే, లేతతమలపాకులాంటి ఆమె సున్నిత స్వర్గాడోలి కలలో కన్ను మూసి, మేను మరిచి, కమ్మగా నిద్రపోవచ్చు !

అరుంధతి యిప్పుడు అక్షరాలా సర్వదా తన సొత్తు. ఇన్నాళ్ళూ శరీరం మినహాగా, నామమాత్రంగానే తనదిగా వుండేది. కాని, యీ వేళ ఆ మినహా

యింపు కాస్తాకూడా భర్తీ అయిపో యింది. అరుంధతి అందచందాలకూ, అంగపుష్టికీ, అవయవసౌష్టవానికీ తాను సార్వభౌముడు! ఆ ఐశ్వర్యాలను అనుభ వించటమే తనవొంతు! తనహక్కు..!! తనవిధి!!!

పసిడికాంతు లీనుతూ మిలమిల మెరిసే ఆమె బంగరు దేహాన్ని తన కౌగలిలో నలిపి పారేస్తాడు! ఆమె పరువా న్నంతనూ ఒక పండుగా పిసికి ఆ అనుభూతుల్ని రసంగా జుర్రుకుం టాడు.

శ్రీనివాస్‌లో...

అంతులేని ఏదో ఆరాటం!

అర్థంకాని అదో తమకం!!

తియ్యని అది!

కమ్మని యిది!!

అదీ, యిదీ ఏవిటి!?... ఏవి టేవిటో!... ఎన్నె న్నో!!... ఎప్పుడూ ఎరుగనివి!!!... ఏన్నడూ తెలియనివి!!

తెల్లారిపోయింది.

ఎప్పుడు తెల్లారిపోయిందో!?

ఎంత సేపై తెల్లారిపోయిందో!?

గదిపైన వెంటిలేటర్లోంచి కొంప మునిగిపోతూన్నట్లు తెల్లనివెలుగు!

గదిబయట పళ్ళాలూ, గిన్నెలూ చప్పుడు.

బంధుజనం చేసే గలభా.

పిల్లలు చేసే అల్లరి!

టేబిల్‌మీది రిస్టువాచీలోనిచిన్నముల్లు లేచికూర్చుని, తొమ్మిదంకెను తన్ని పెట్టి, పన్నెండుమీద తలపెట్టి ఒళ్ళు విరుచుకుంటోంది!

తెల్లారటం అంటే ఏదో మించిపోయి నట్లు యిట్టే తెల్లారిపోయింది. కాని ఎంతకీ చీకటి పడదు!

పడయింది.

పదకొం డయింది.

పన్నెడు... ఒంటిగంట... రెండు... అబ్బ!... యింకా పది గంటలు గడవాలి! అంటే ఆరువందల నిముషాలు! ముప్పై ఆరువేల సెక నులు!!

ఒక్కసారి గుండె బాదుకున్నాడు శ్రీనివాస్.

కళ్ళెం లేని గుర్రంలా అతన్లో వూహలు వురకలు వేస్తున్నాయ్.

కాళ్ళు విరిగిపోయిన కాలం చట్టల మీద దేకుతోంది?

అల్లంతదూరంలో నల్లచీరె!

నల్లచీరలో నిశాకాంత!!

కాళ్ళకు బుద్ధిచెప్పింది వెలుగు!

చుట్టూ అంతా ఒకటే తమం!!

శ్రీనివాస్‌లో తమి తీరని తమకం!

తమకం తీరని తమి!!

గడియారంలోని చిన్న ముల్లును తొమ్మిదగ్గర పెద్దముల్లు మింగేసింది!

తొమ్మిదికి పావుతక్కువ.

గదిలో పందిరిపట్టిమంచం.

చీమలపుట్టలా చుట్టూ పేరంటాళ్ళు!

'మళ్ళీ పేర్లు చెప్పండి! ... గా ... డి...ద...గు...డు చెప్పండి!'

"అబ్బ!...చప్పున కానిద్దు రొదినా! కునుకుపా ట్లొస్తున్నాయ్."

వదినగారిమీద శ్రీనివాస్ విసురు.

"అప్పుడే కునుకుపా ట్లొస్తే ఎట్లా అబ్బాయ్? ... ఫరవాలేదు, యింకా పన్నెండుగంటల కాలం వుంది, ఎక్కి తిక్కను. కావలిస్తే, రేపు మధ్యాహ్నం ఒంటిగంటకు లేవండి! మిమ్మ ల్నెవరూ అడగరు. కాని, మీ వినోదాలకు ముందు మా వేడుకలు జరిగితీరాల్సిందే! గంధం రాసి, పేర్లు చెప్పాల్సిందే!"

వొదినగారి వేళాకోళానికి మరిది మందహాసం!

ముసిముసి నవ్వులు నవ్వుతూ మొహం ప్రక్కకు తిప్పేసుకుని, కొత్త తోటి కోడలి కులుకు!!

పవిఁటికొొంగులు నోటి కడ్డం పెట్టుకుని యువ పేరంటాళ్ళ పళ్ళికిలింతలు!!!

"నువ్వూ చెప్పెయ్యమ్మా చప్పున అరుంధతీ! ... మీ ఆయనకు అప్పుడే కునుకుపా ట్లొస్తున్నాయట, పాపం!" ఎవరి చేతనో మురిపించుకుంటోంది అరుంధతి.

"శ్రీ...ని...వా...స్ బా...వ... గా...రు!" గంధం గిన్నెలో మునక వేసిన గాజులచేతి వేళ్ళు శ్రీ ని వా స్ మొహంవైపు ఓసారి రాకెట్లా దూసుకు పోయి, చెంపలమండలాన్ని ఇలా తాకి అలా తిరిగి వచ్చేశాయ్.

వెండి పళ్ళెరంలో కర్పూరదీపం వెలిగింది!

మంగళహారతి యుగళగీతంలా పలికింది!!

గది తలుపులు ఆవల్నుంచి భళ్ళు మన్నాయ్.

మళ్ళీ తెల్లారింది. కాని, "భళ్ళున" కాదు. మొదటి వాత్రిలా, ఈసారి ఆ తెల్లారటంలో ఆ 'శబ్దం' శూన్యం! ఆ వేగం మృగ్యం!! తీసుకు తీసుకు తెల్లా రింది. చచ్చిచెడి, విధిలేక తెల్లారింది.

"మొహం కడుక్కుందుకి బ్రష్షూ, పేష్టూ తెమ్మన్నారా?"

బెడ్రూమ్‌లోనే యీజీ చెయిర్లో, తలమీద చేతులు పెట్టుకుని, కళ్ళు మూసు కూర్చున్న శ్రీనివాస్‌ను సమీపించి, సౌమ్యంగా వినమ్రంగా, శ్రావ్యస్వరంతో తియ్యగా అడిగింది అరుంధతి.

"నువ్వేఁవీఁ అందివ్వ నక్కర్లేదు!" తపస్సు చేస్తూన్న మునిలా కనువిప్పి చూడలేదు, మొహం ఎత్తి చూపలేదు. ఎలా కూర్చున్నవా డలాగే కూర్చుని, చీదరించుకున్నాడు శ్రీనివాస్.

ఒక్కసారిగా అదిరిపడింది అరుంధతి.

'ఎందు కంత చీదరించుకుంటు న్నారు?...నే నేం తప్పుచేశా నని? ... పోనీ, ఒకవేళ తెలిసో, తెలీకో ఏదైనా చేస్తే-నువ్వు ఫలానా తప్పుచేశావ్-